క్లుప్తంగా

నేడు టెక్‌వేవ్-2025 ప్రదర్శన

కమలాపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం టెక్‌వేవ్-2025 ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. సత్యనారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్ వేవ్-2025లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు, ఎలక్ట్రానిక్స్ గేమ్‌లు, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు టెక్‌వేవ్-2025లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జూదరుల అరెస్ట్

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామంలో జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.3,670 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే సమాచారాన్ని అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రిదేవి విగ్రహ ప్రతిష్ట


ఆలయంలో ప్రతిష్టించిన గాయత్రిదేవి విగ్రహం

వల్లూరు: వల్లూరులో గాయత్రి దేవి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే వివిధ రకాల హోమాలు నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన ప్రజలు ఆలయానికి చేరుకుని గాయత్రిదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు, భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కల్యాణం.. కమణీయం


కల్యాణ మహోత్సవంలో శ్రీదేవి, భూదేవితో శ్రీనివాసుడు

వీరపునాయునిపల్లె: మండల పరిధిలోని మొయిళ్లచెరువు గ్రామ సమీపంలోని తిరుమలరాయుని కొండపై వెలసిన తిరుమలేసుని ఆలయం తృతీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం కమణీయంగా సాగింది. కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్యాణం అనంతరం ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రిపబ్లిక్ క్లబ్‌లో తనిఖీలు


క్లబ్‌లో తనిఖీలు చేస్తున్న డీఎస్పీ

జమ్మలమడుగు: పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్‌పై డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సోమవారం డీఎస్పీకి క్లబ్‌లో పేకాట ఆడుతున్నారంటూ ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఫిర్యాదు రావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దాడులు చేసినట్లు డీఎస్పీ వివరించారు. రికార్డులను పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

వేంపల్లె : వేంపల్లెలోని తల్లి శెట్టి సుబ్రహ్మణ్యం, శేషమ్మ జిల్లా పరిషత్ బాలుర, బాలికల ప్రభుత్వ పాఠశాలల వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శివ మునెమ్మ, నారాయణమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆయా పాఠశాలలో ఆవరణంలో జాతీయ జెండాను సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఎగరవేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్, స్థల దాత కుటుంబ సభ్యులు సృజన్ కుమార్, కృష్ణనందన్, శిల్పిక, పాఠశాల చైర్మన్ బుజ్జి, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను అరికట్టాలి

వేంపల్లె : మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్న అక్రమ ముగ్గురాయి మైనింగ్‌ను అరికట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వేంపల్లె పట్టణంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ముగ్గురాయి తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు.

పేదల బియ్యం.. అక్రమార్కుల భోజ్యం

- లాభాలు గడిస్తున్న దళారులు
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు యంత్రాంగం


అక్రమంగా రేషన్ బియ్యం తరలించే వాహనాన్ని, నిందితుడిని పట్టుకున్న అధికారులు (ఫైల్)

వేంపల్లె : పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం కొందరు అక్రమార్కులకు లక్షలాది రూపాయల ఆదాయ వనరులుగా మారుతున్నాయి. కొందరు పట్టణాలు, గ్రామాల్లో తిరిగి బియ్యాన్ని సేకరించి దళారులకు అప్పగిస్తే.. వారు ఆ బియ్యాన్ని మరో వ్యక్తికి అప్పగిస్తున్నారు. చివరకు రేషన్ బియ్యం పేదల నుంచి దూరంగా తరలిపోతోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తోంది.

ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ కార్డుల్లో ఒక్కొక్క వ్యక్తికి ఐదు కిలోల చొప్పున కార్డులో ఎంతమంది కుటుంబ సభ్యులు ఉంటే అంతమందికి రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. అయితే కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో రేషన్ కార్డుదారులకు బియ్యం ఉచితంగా అందిస్తున్నారు. మండలంలో మొత్తం 20 వేలకుపైగా రేషన్‌కార్డులు ఉండగా, నెలకు 3,824.68 క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వం కేటాయిస్తోంది. అయితే అధిక శాతం మంది రేషన్ బియ్యం వినియోగించడానికి ఇష్టపడకపోవడంతో వారి నుంచి కొనుగోలుదారులు కిలో రూ.17 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేసి వాటిని మధ్య దళారికి విక్రయిస్తున్నారు. కాగా కేజీ బియ్యం అందించడానికి ప్రభుత్వం దాదాపు రూ.35 ఖర్చు చేస్తుండగా, అక్రమార్కులు మాత్రం రూ.17లకే కొనుగోలు చేస్తున్నారు. పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కుల భోజ్యంగా మారుతోంది.

సరిహద్దులు దాటుతున్న బియ్యం

గ్రామాల నుంచి సేకరించిన బియ్యాన్ని కొందరు ముఠాగా ఏర్పడి గుట్టుచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో రేషన్ పంపిణీ చేసిన తొలి వారంలో కొందరు అక్రమార్కులు గ్రామాలు తిరిగి కొనుగోలు చేసి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి ఎవరి కంట పడకుండా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. మండలంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాలను పలుమార్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటికీ అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. పేదలకిచ్చే రేషన్ బియ్యంతో అక్రమార్కుల జేబులు నింపుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచాం



ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. బియ్యం తరలించినా వారికి, సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం తరలించకుండా గ్రామాల్లో గట్టి నిఘా ఉంచాం. గ్రామాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటే సమాచారమివ్వాలని కోరాం.

– రంగారావు, ఎస్ఐ, వేంపల్లె

రేషన్ బియ్యం విక్రయించినా నేరమే



రేషన్ బియ్యం విక్రయించినా.. కొనుగోలు చేసినా నేరమే. బియ్యం ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అక్రమ రవాణా జరగకుండా గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. అక్రమ రవాణాపై తమ దృష్టికి వస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు.

– హరినాథ్‌రెడ్డి, మండల తహసీల్దార్, వేంపల్లె

పేలిన ఫ్రిజ్.. తప్పిన ముప్పు


బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో నివాసముంటున్న తెల్లాకుల వెంకటేష్ ఇంట్లో సోమవారం ఫ్రిజ్ పేలింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే యర్రగుంట్ల తహసీల్దార్ శోభన్‌బాబు పోట్లదుర్తికి వెళ్లి ఇంటిని పరిశీలించారు. ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఇంట్లోని విలువైన వస్తువులు దహనమయ్యాయని తెలిపారు. నష్టపరిహారం అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తహసీల్దార్ తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఫ్యాన్లు చోరీ

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణంలో శ్రీ వేంకటేశ్వర హైస్కూల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఫ్యాన్లు దొంగలించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ చంద్ర ఓబుళరెడ్డి సోమవారం తెలిపారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో దుండగులు పాఠశాలలోకి వెళ్లి ఫ్యాన్లు దొంగలించారన్నారు. దొంగలు ఈ ప్రాంతంలో హల్‌చల్ చేస్తున్నారని తెలిపారు.

వైఎస్ కుటుంబం గురించి మాట్లాడే అర్హత లేదు

తూగుట్ల మధుపై విరుచుకుపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణాన్ని సుందరీకరణ చేసిన ఘనత వైఎస్ కుటుంబానిదేనని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆఫీస్, కౌన్సిలర్ కిశోర్, కో-ఆప్షన్ సభ్యుడు దాసరి చంద్రమౌళి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోళ్ల భాస్కర్‌లు అన్నారు. సోమవారం పట్టణంలోని బాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూగుట్ల మధుసూదన్ రెడ్డి, వైఎస్ కుటుంబంతో ఉండి వైఎస్ కుటుంబం ద్వారా లబ్ధి పొంది గుర్తింపు తెచ్చుకున్నారని, అది మరచి మళ్లీ వైఎస్ కుటుంబం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పులివెందుల పట్టణానికి ప్రధాన నీటి వనరు నక్కలపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం వైఎస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారని, అది గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. పులివెందుల పట్టణాన్ని తమ సొంత ఇంటిలా భావించి పట్టణాన్ని అభివృద్ధి చేసిన ఘనత వైయస్ కుటుంబానిదేనని తెలిపారు. ప్రభుత్వం మారిన మరుసటి రోజే పులివెందుల అభివృద్ధిని అర్ధాంతరంగా ఆపేసి పాడాను నిర్వీర్యం చేసి చంద్రబాబు హయాంలో పులివెందుల అభివృద్ధి చెందిందనడం తూగుట్ల మధు అవివేకానికి నిదర్శనమని, కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి చూపించాలని పేర్కొన్నారు.

ఒక్కపైసా కూడా ఇవ్వలేదు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పులివెందులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మున్సిపాలిటీ సొంతంగా చేసే అభివృద్ధి పనులను కూటమి నాయకులు చేయించినట్లు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్ కుటుంబం ఎవ్వరిపై కక్ష పూరిత చర్యలకు పాల్పడలేదని తెలిపారు. నీ చర్యల వలన పోలీసులు కేసు పెడితే, వైన్ షాప్ తీసేయమని చెప్పడం వలన కేసు నమోదు చేశారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పట్లో క్రిస్టియన్ లైన్‌లో ఉన్న ఒక వ్యక్తి కుటుంబంపై దాడి చేస్తే అప్పటి డీఎస్పీ మీపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కట్టాలన్నప్పుడు మీ చిన్నాన్న జయరామిరెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, గంగిరెడ్డితో మాట్లాడించి కేసు వాపసు చేయించిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు. పట్టణంలో ఇప్పటికే మీరు చేస్తున్న నిర్వాహకాల వలన ప్రజలు అసంతృప్తితో రగిలి పోతున్నారని, త్వరలో ప్రజల ద్వారానే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవీరభద్రస్వామి కల్యాణం


భద్రకాళీసమేత వీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న శ్రీవీరభద్రస్వామి ఆలయంలో సోమవారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు బసవరాజు, రుద్రమూర్తిలు స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోయుక్తంగా నిర్వహించారు. సాయంత్రం వీరభద్రస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వీరభద్రస్వామి, శివుడు, భద్రకాళి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం స్వామివారికి ఉదయం విశేష పూజల అనంతరం మహా కుంభ నివేదన నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు, వీరశైవ గురుజంగమ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన కూటమి ప్రభుత్వం

పులివెందుల రూరల్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించిందని వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గ నాయకులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మాజీ చైర్మన్ రసూల్, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, నాయకులు సాంబశివరెడ్డి, బయపురెడ్డి, మరకా శివకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి (చంటి), బాబురెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, పద్మనాభ రెడ్డి, వీరారెడ్డి, నాగరాజు, ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : కూటమి ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం యర్రగుంట్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వలన విద్యార్థులు ఫీజుల కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బుధవారం నిర్వహిస్తున్న ఫీజు పోరు ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య పార్టీ పట్టణాధ్యక్షులు జయరామిరెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో సజీవం


మృతుడి కుటుంబసభ్యుల నుంచి కార్నియాలను అందుకుంటున్న టెక్నీషియన్ హరీష్

వేంపల్లె : కళ్లను దానం చేయడం ద్వారా చూడలేని మరొకరికి చూపుని కల్పించవచ్చని, తమ కళ్లు వేరొకరికి అమరిన కారణంగా.. వారి చూపుల్లో మృతులు సజీవంగా ఉండిపోతారని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు పేర్కొంది. సోమవారం వేంపల్లె మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామానికి చెందిన సిరిగిరెడ్డి చిన్నపురెడ్డి (80) మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్యక్షుడు రాజుకు తెలిపారు. దీంతో రాజు టెక్నీషియన్ హరీష్‌తో కలిసి చిన్నపురెడ్డి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మనిషి మరణాంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని అంధత్వ రహిత సమాజం కోసం పాటు పడాలని కోరారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దలు, బంధువులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

కమలాపురం: ఎన్‌పీఎస్‌ఎస్, సీఎల్‌ఎస్ యాప్‌లను రైతులందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని డీడీఏ ఎఫ్‌టీసీ రమణారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని వీఏఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌లలో పంటలకు సోకే పురుగులు, తెగుళ్ల ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. యాప్ ద్వారానే రైతులకు వాడాల్సిన మందుల, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేస్తామని చెప్పారు. అలాగే వ్యవసాయానికి సంబంధించిన సమాచారం అంతా యాప్‌లో ఉంటుందన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ బుడ్డశనగ పంటకోత ప్రయోగాలను తక్షణం పూర్తి చేయాలని సూచించారు. ఏఓ నాగ భూషణం ఎన్‌పీఎస్‌ఎస్, సీఎల్‌ఎస్ యాప్‌ల పనితీరుపై అవగాహన కల్పించారు. మండలాల ఏఓలు సరస్వతి, శ్యాంబాబు, శ్రీకాంత్‌రెడ్డి, సంతోషిణి, ఏఈఓ దస్తగిరి, వీఏఏలు పాల్గొన్నారు.

ట్రాఫిక్, రోడ్డు భద్రతపై అవగాహన


విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంవీఐ బీవీ ప్రసాద్

పులివెందుల రూరల్ : ట్రాఫిక్, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటప్రసాద్ అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని అహోబిలాపురం మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రత నియమాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు తీవ్ర గాయాలు

సింహాద్రిపురం : మండలంలో పైడిపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పైడిపాలెం గ్రామానికి చెందిన వెంకటలక్షుమ్మ భర్త చిన్న వెంకట్రాములు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం తన ఇంట్లో కరెంటు స్విచ్ వేయడంతో సిలిండర్ పేలి ఆమెకు మంటలు అంటుకున్నాయి. అక్కడే ఉన్న ఆమె భర్త, గ్రామస్తులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకట లక్షుమ్మను చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పరీక్షకు ఎంపిక

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం శ్రీవివేకానంద హైస్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న జితేంద్ర రాయల్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి అబాకస్ పరీక్షకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఆదివారం కడపలో జరిగిన జిల్లా స్థాయి లెవెల్-3 అబాకస్ పోటీ పరీక్షలో విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి అబాకస్ పరీక్షకు ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థి ఎంపికపట్ల పాఠశాల డైరెక్టర్ జాఫర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందించాలి



మున్సిపల్ కార్యాలయంలో ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల నగర పంచాయతి పరిధిలోని టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. సోమవారం యర్రగుంట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తే సుమారు 1,500 కుటుంబాలు సొంతింటి కల నెరవేరుతుందన్నారు. రూ. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారాయని పేర్కొన్నారు. గృహాల పరిసరాల్లో ముళ్లకంప పెరిగిందని, ఇనుప కడ్డీలు తుప్పు పట్టాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా పట్టించుకోకపోవడంతో టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ యంత్రాంగం త్వరగా చర్యలు తీసుకొని లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

జమ్మలమడుగు: చిటిమిటి చింతల గ్రామంలోని ఎస్టీలకు ఇళ్ల స్థలాలతోపాటు, సాగు భూమి ఇచ్చే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట చిటిమిట చింతల గ్రామ ప్రజలతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో ఇండ్ల స్థలాలు పోయాయని వాటికి పరిహారం ఇవ్వలేదన్నారు. గతంలో బ్రహ్మిణి స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని స్థానికులకు ఉద్యోగావకాశాలు ఇస్తామని హామీ ఇచ్చారని, స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాకపోవడంతో వారికి ఎదురు చూపులు తప్ప ఏమీ మిగలలేదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, ప్రసాద్, మనోహర్‌బాబు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

వేంపల్లె : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి బి. వెంకటరాములు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్‌గా ముందుకు పోతుందని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నప్పటికీ ఆచరణలో శూన్యమని విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం పార్లమెంటులో కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, వెనకబడిన జిల్లాల అభివృద్ధి, ప్యాకేజీపై బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం విచారకరమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ కేటాయింపులను త్వరలో జరగనున్న ఆయా రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ కేటాయింపులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. కార్పొరేట్ కంపెనీల వ్యాపారాన్ని మరింత సరళతరం చేసేందుకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కేటాయింపులు జరుగుతున్నాయని విమర్శించారు.

చేనేతలకు అన్యాయం

జమ్మలమడుగు: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేత రంగానికి తీరని అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శివనారాయణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీఎస్టీని చేనేత రంగానికి మినహాయింపు ఇస్తామని కేంద్ర ప్రకటించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దేశీయ వస్త్ర మార్కెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకూ పోరాడతాం


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

జమ్మలమడుగు రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాడుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నాగరాజు స్పష్టం చేశారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ చేపడుతున్న లక్షల డప్పులు- వేల గొంతులు కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం సాయంత్రం మైలవరం మండలం వేపరాల గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ లక్షల డప్పులు- వేల గొంతులు కార్యక్రమాన్ని మాదిగలు, ఉపకులాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని హైదరాబాద్‌లో గొంతెత్తి చాటుతామని పేర్కొన్నారు. లక్షల డప్పుల చప్పుళ్లకు ప్రభుత్వాలు దిగివచ్చి వర్గీకరణ చేయాలని కోరారు. ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా వర్గీకరణ సాధనకోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధనంకోసం ఎంతటి త్యాగాలకైనా వెనుకాడబోమన్నారు. వర్గీకరణతోనే మాదిగల కష్టాలకు విముక్తి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. శంకర్, గురుబాబు, కార్తీక్, నాగన్న, ఓబులేసు, పెద్ద ఓబులేసు పాల్గొన్నారు.

వసంత పంచమి.. పిల్లలకు అక్షరాభ్యాసం


పులివెందుల టౌన్ : అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు


సింహాద్రిపురం : శ్రీసరస్వతీదేవికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యా మందిరం పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా హోమం, వేదమంత్రాల మధ్య 80 మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వసంత పంచమి పండుగ విశిష్టత గురించి తెలియజేసి భజన చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రబంధ కారిణి సభ్యులు, పాఠశాల హెడ్మాస్టర్ జి.వి.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, చిన్నారులు, పాల్గొన్నారు.

ఇడుపులపాయలో..

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సోమవారం డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, గ్రంథాలయ అధికారి కోనప్ప ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ బృందం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిదేవి విగ్రహాన్ని గంధం, పసుపు, కుంకుమతో అలంకరించి అష్టోత్తర శతనామాలతో, సహస్రనామాలతో, వేద మంత్రాలతో, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్తా వసంత పంచమి విశిష్టతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకాలమ్మగూడూరులో..

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం హెడ్మాస్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చదువుల తల్లి సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ భాస్కర్ వసంత పంచమి విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం టీచర్ శ్రీదేవి విద్యార్థులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి

ముద్దనూరు: మండలంలో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసంత పంచమి సందర్భంగా సరస్వతి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, ఫిజికల్ డైరెక్టర్ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీ సరస్వతి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి విద్యార్థులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. స్థానిక స్టేషన్ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి నాగేశ్వరరావునాయక్ ఉపాధ్యాయులు, విద్యార్థులు వసంత పంచమి వేడుకల్లో పాల్గొన్నారు.